

జగన్ లంచాలపై విచారణ జరపాలి

- అదానీ దగ్గర రూ.1750 కోట్లు తీసుకుంటే..
- మరి మిగిలిన వారి నుంచి ఎంత తీసుకున్నారో..?
- ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు కో వైస్ ఛైర్మన్ ఆనం

నెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'తొమ్మిది వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు అదానీ నుంచి జగన్మోహన్‌రెడ్డి రూ.1750 కోట్లు లంచాలు తీసుకుంటే.. ఇక మిగిలినవారి నుంచి ఎన్ని వేల కోట్లు లంచం తీసుకున్నారో..? బయటకు రావాలి. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరపాలి' అని ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు కో వైస్‌ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అంతర్జాతీయ స్థాయి క్రిమినల్‌గా ఎదిగిన జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు' అంటూ కేక్ కట్ చేసి వినూత్న రీతిలో వెంకటరమణారెడ్డి నిరసన తెలిపారు.

టీడీపీ నాడే చెప్పింది..!

'సీఎం హోదాలో చంద్రబాబు అనేకమంది పారిశ్రామిక వేత్తలను కలుస్తున్నారు. ఎవరెవరిని కలిశారు..? ఎందుకు కలిశారు..? అన్న వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నాం. కానీ సీఎంగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి, అదానీలు మూడుసార్లు సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో ఏం మాట్లాడుకున్నారన్న విషయాలు ప్రజలకు చెప్పలేదు. మూడోసారి సమావేశం జరిగాక సోలార్ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం ఫైల్స్ పరిగెత్తాయి. సోలార్ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం మోసమని టీడీపీ మొదటి నుంచీ చెబుతూనే ఉంది. ఇప్పుడు అమెరికా దర్యాప్తు సంస్థలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.. అని ఆనం వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆనం వెంకటరమణారెడ్డి

జగన్ ఎందుకు స్పందించడం లేదు..?

'రూ.1750 కోట్లు ఎక్కడ దాచారు..? భారతీ సిమెంట్, సాక్షి మీడియాలో పెట్టుబడులు పెట్టారా..? లేక డైమండ్లు, కొకైన్ రూపంలో దాచి పెట్టారా..? లేక ఎన్నికల్లో ఖర్చు చేశారా..? అన్నది కూడా బయటకు రావాలి. సెకీతో ఒప్పందాలు చేసుకున్నప్పుడు రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి, కడప జిల్లా వాసి నాగార్జునరెడ్డి ఉన్నారు. అధిక ధరకు సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకుంటుంటుంటే ఆయనెందుకు సంతకం చేశారు..? దీనిపై నాగార్జునరెడ్డి బయటకు వచ్చి సమాధానం చెప్పాలి. ప్రతీ విషయానికి బయటకొచ్చి ప్రెస్‌మీట్ పెట్టే జగన్మోహన్‌రెడ్డి ఈ విషయంలో ఎందుకు బయటకు రావడం లేదు..? నేను తప్పు చేయలేదని ఆయన ఎందుకు చెప్పలేకపోతున్నారు..? ఇకనైనా జగన్‌పై ఉన్న కేసులను వేగవంతం చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని వెంకటరమణారెడ్డి అభ్యర్థించారు.

నారాయణ దృష్టి... నవయంత్రం సృష్టి !

- రైతులకు ఉపయోగపడేలా ఉపకరణాల తయారీ
- చదివింది తొమ్మిదో తరగతి మాత్రమే..
- ఆటోమొబైల్ ఇంజనీర్‌లా నూతన ఆవిష్కరణలు

ఆ యువకుడు ఆటో మొబైల్ ఇంజనీరేంకాదు.. చదివింది తొమ్మిదో తరగతి మాత్రమే. అయితే, అతని చేతిలో రూపొందిన మినీట్రాక్టర్, టిల్లర్లు, కల్టివేటర్లు చూసి పలువురు అబ్బురపడుతున్నారు. ఆలోచనకు సృజనాత్మకత తోడైతే చక్కని ఆవిష్కరణలు వస్తాయని నిరూపించాడు పొదలకూరు అయ్యప్పనగర్‌కి చెందిన బోడేలు పెంచలయ్య రెండో కుమారుడు పెంచల నారాయణ. ఆ యువకుడికి చదువుపై ఆసక్తి లేకపోవడంతో తండ్రి నిర్వహిస్తున్న వెల్డింగ్ దుకాణంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

ఆటో పరికరాలతో ట్రాక్టర్ తయారీ

పెంచల నారాయణ తండ్రితోపాటు దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తూనే.. రిపేరుకు వచ్చిన యంత్రం ఎలా పని చేస్తోందని నిశితంగా పరీక్షించే వాడు. విక్రయానికి వచ్చే ఆటో, మోటారు సైకిల్ స్పేర్‌పార్ట్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి భద్రపరిచేవాడు. ఖాళీ సమయంలో తన ఆలోచనకు పదును పెడుతూ సైకిల్ స్కూటర్‌ను రూపొందించాడు. మూడు నెలలు శ్రమించి ఆటో పరికరాలతో ట్రాక్టరును తయారు చేశాడు. దానికి అనుకూలంగా ఉండేలా హైడ్రాలిక్ సిస్టంతో పనిచేసే కల్టివేటర్‌ను తయారుచేశాడు. ఆ యువకుడు తయారు చేసిన మినీట్రాక్టర్, కలుపు తీసేందుకు ఉపయోగించే కల్టివేటర్, టిల్లర్ , ఇతర పరికరాలు అంతర్ సేద్యానికి ఉపయోగపడుతున్నట్లు గుర్తించిన రైతులు వాటిని విరివిగా కొనుగోలు చేస్తున్నారు.



మినీ ట్రాక్టర్‌ను నడుపుతున్న పెంచలనారాయణ

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

తక్కువ ధరకు అందించాలని..

వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ అవుతుండటాన్ని గుర్తించి, తక్కువ ధరకే అంతర్ సేద్యానికి ఉపయోగపడే యంత్రాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. వెడల్పు తక్కువ ఉన్న బొప్పాయి, అరటి, నిమ్మ, మామిడి, జామ తోటల్లో అంతర్ సేద్యానికి ఉపయోగపడేలా మినీ ట్రాక్టర్ తయారుచేశా. దున్నేందుకు ఉపయోగించే కల్టివేటర్, టిల్లర్లను రైతులు తీసుకెళుతున్నారు. వరిలో కలుపు తీసే యంత్రాన్ని తయారు చేశా. రూ.600 ఖర్చుతో మూడు ఎకరాల్లో కలుపు తీసేందుకు ఈ యంత్రం పనికొస్తుంది. మినీ ట్రాక్టరు తయారీకి రూ.25వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు అయింది. మరిన్ని కొత్తకొత్త యంత్రాలను రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నా.

- బోడేలు పెంచల నారాయణ

ఎందుకీ నిర్లక్ష్యం ?

- గుంతలమయంగా పొదలకూరు రోడ్డు
- ఏడాది క్రితం రూ.6 కోట్లతో టెండర్లు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- చలనంలేని ఆర్అండ్‌బీ అధికారులు
- నగర ప్రజలకు తప్పని అవస్థలు



నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఏర్పడిన గుంతలు

నెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని.. అన్నట్లుగా తయారైంది నెల్లూరు నగరంలో పొదలకూరు రోడ్డు పరిస్థితి. దారుణంగా దెబ్బతిన్న ఈ రోడ్డును బాగు చేసేందుకు ఏడాది క్రితం అనుమతులు లభించాయి. వెంటనే టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ కూడా జరిగింది. ఎట్టకేలకు రోడ్డును బాగు చేస్తున్నారని నెల్లూరు నగర ప్రజలంతా సంతోషించారు. కానీ ఏడాదైనా ఇంత వరకూ పనులు మొదలుపెట్టలేదు. ప్రభుత్వం కూడా మారిపోయింది. అయినా అటు కాంట్రాక్టర్‌లోకానీ, ఇటు ఆర్అండ్‌బీ అధికారుల్లో కానీ చలనం లేదు. పనులు చేయాల్సిన కాంట్రాక్టర్, చేయించాల్సిన అధికారులు దర్జాగా తిరుగుతుండగా నెల్లూరు నగర ప్రజలు మాత్రం నరకయాతన అనుభవిస్తున్నారు.

నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు అత్యంత రద్దీ రహదారి. సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల ప్రజలే కాకుండా కడప జిల్లా నుంచి కూడా నిత్యం వేలాదిమంది ఈ రోడ్డు మీదుగానే నెల్లూరు నగరంలోకి ప్రవేశిస్తుంటారు. ఇక నెల్లూరులో కూడా నాలుగో వంతు భాగం ప్రజలు ఈ రోడ్డు మీదనే ప్రయాణిస్తుంటారు. ట్రాఫిక్ పెరిగిపోవడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. గత ప్రభుత్వంలో నిర్వహణ లేకపోవడంతో మరీ దారుణంగా తయారైంది. డీకేడబ్ల్యూ కాలేజీ నుంచి డైకస్ రోడ్డు సెంటర్ వరకూ విస్తరించి నాలుగు వరుసల రోడ్డు వేయాలన్న ప్రతిపాదన చాలా కాలం నుంచి ఉంది. అయితే నాలుగేళ్ల క్రితం పశ్చిమ వైపు రోడ్డు బాగు చేసేందుకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అప్పుడు రోడ్డు వేసినప్పటికీ కొద్ది రోజులకే మళ్లీ దెబ్బతిన్నది. సైడు కాలువలు లేకుండా నిర్మాణం చేస్తున్నారని, దీని మూలంగా రోడ్డుపై నీళ్లు నిలబడి దెబ్బతినే ప్రమాదముందని నాడే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదు. ఊహించిన విధంగానే వేసిన రోడ్డుతో పాటు తూర్పు వైపున ఉన్న రోడ్డు నీళ్లు నిలబడి మరింత గుంతలమయంగా మారింది. పశ్చిమ, తూర్పు వైపు రోడ్డు ఎగుడుదిగుడుగా మారిపోవడంతో వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరైనా..

అయితే అనేక విజ్ఞప్తుల తర్వాత ఎట్టకేలకు తూర్పు వైపు రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు గతేడాది సుమారు రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పూర్తి చేశారు. పశ్చిమ వైపు రోడ్డు వేసిన కాంట్రాక్టరే తూర్పు వైపు రోడ్డు వర్కును కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి పనులు మొదలు పెట్టి ఉంటే ఈ పాటికి రోడ్డు పని పూర్తయ్యేది. కానీ ఏడాది గడిచినా పనులు ప్రారంభించలేదు. ఏడాది నుంచి కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోయినా ఆర్అండ్‌బీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చి పనులు మొదలు పెట్టించాల్సిన అధికారులే ఆ కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మరో వైపు పొదలకూరు రోడ్డుకు సెంట్రల్ డివైడర్ నిర్మాణానికి సంబంధించి సుమారు రూ.1.50 కోట్లతో గత నెలలో టెండర్లు పిలిచిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు.. వెంటనే పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కూడా జరుగుతున్నాయి. కాగా ఈ విషయంపై ఆర్అండ్‌బీ నెల్లూరు ఈఈ మురళీకృష్ణను వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు మొదలుపెట్టిస్తామని పేర్కొన్నారు.

గుక్కెడు నీళ్లివ్వండి సార్...!

- విద్యార్థుల వేడుకోలు
- పాఠశాలల్లో పనిచేయని వాటర్ ప్లాంట్లు
- రూ. కోట్ల నిధులు నీళ్లపాలు
- తాగునీరు దొరక్క స్టూడెంట్ల ఇక్కట్లు
- ప్రస్తుతం పనిచేస్తున్నవి 641
- నిరుపయోగంగా 113 ప్లాంట్లు
- 'నాడు-నేడు' పథకం అపహాస్యం



ఉదయగిరి మండలం జీ.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులకు గురైన శుద్ధిజల కేంద్రం

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించి, కార్పొరేట్లకు దీటుగా తీర్చిదిద్దుతామని చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం విమర్శలకు తావిస్తోంది.ముఖ్యంగా తాగేందుకు నీరు లేక విద్యార్థులు పడేపాట్లు వర్ణణాతీతం. జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలాయి. విద్యార్థులకు తాగునీరు అందని ద్రాక్షలా మారింది. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు నేడు అత్యధిక పాఠశాలల్లో నిరుపయోగంగా మారాయి.

1,059 స్కూళ్లలో ప్లాంట్లు

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 1,059 పాఠశాలల్లో తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు యంత్రాలు, పరికరాలను సమకూర్చింది. వీటి నిర్వహణకు రూ.40 కోట్లకుపైగా వెచ్చించింది. వీటిల్లో సుమారు 800కిపైగా పాఠశాలల్లో నిర్వహణ లేకపోవడంతో యంత్రాలన్నీ పనిచేయలేదు. మరికొన్ని ప్రాంతాల్లో వీటిని పూర్తిగా మూలన పడేశారు. వీటిలో కొన్ని ప్లాంట్‌లను దాతలు ఏర్పాటు చేయగా, మిగిలినచోట్ల ప్రభుత్వం టెండర్ల ద్వారా సంస్థలను ఆహ్వానించి ఏపీఈడబ్ల్యుఐడీసీ ద్వారా ఏర్పాటుకు అనుమతులిచ్చింది.

ఏర్పాటుకు నిబంధనలు

విద్యార్థుల సంఖ్య, ఆయా పాఠశాలల్లోని నీటిలో లవణీయత, ఫ్లోరైడ్ శాతాన్ని బట్టి వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. 200 మందిలోపు పిల్లలున్న బడిలో రూ.లక్ష విలువ చేసే యంత్రాన్ని, 300 మంది విద్యార్థులు కలిగి, నీటిలో టీడీఎస్ శాతం ఎక్కువగా ఉంటే రూ. రెండులక్షల నుంచి రూ. మూడు లక్షల విలువైన యంత్రాలను ఏర్పాటు చేశారు. 800 మందికిపైగా విద్యార్థులుండే పాఠశాలల్లో రూ.నాలుగు నుంచి రూ. ఐదు లక్షల విలువ చేసే ప్లాంట్‌లను సమకూర్చారు. ఇంత ఖర్చుచేసినా ఇవి విద్యార్థులకు ఉపయుక్తం లేకుండా పోయాయి. కాగా మూలన పడిన 800 ప్లాంట్లలోని కొన్నింటిని కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయించింది. తాజాగా జిల్లాలో 641 ప్లాంట్‌లు పనిచేస్తుండగా, 113 ప్లాంట్‌లు నిరుపయోగంగా ఉన్నాయి.

తాగునీరు లేక విద్యార్థుల ఇక్కట్లు

జిల్లాలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమికోన్నత, 418 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,467 ప్రభుత్వ బడులున్నాయి. వీటిల్లో సుమారు నాలుగు లక్షల మంది చదువుతున్నారు. నాడు-నేడు పనులు చేపట్టిన పాఠశాలలతో పాటు మిగిలిన బడుల్లో కూడా నీటి సమస్య తీవ్రంగా ఉంది. 90శాతం మంది విద్యార్థులు ఇళ్ల నుంచే సీసాల్లో నీరు తెచ్చుకుంటున్నారు. మిగిలిన చిన్నారులు కుళాయిలు, బోర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీటినే విద్యార్థులు తాగుతు న్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రతి ఒక్కరూ కనీసం రోజుకు మూడు లీటర్ల నీటిని తాగాలి. పాఠశాల సమయంలో విద్యార్థులు రెండు లీటర్ల నీటిని తాగాలి. అయితే స్కూళ్లలో నీరు లేకపోవడం, బయట నీరు తెచ్చుకునే అవకాశాలు లేకపోవడంతో వెంట తీసుకెళ్లిన సీసాలోని నీటితోనే రోజంతా సర్దుకోవాల్సి వస్తున్నది. లేదా బయట దొరికే స్వచ్ఛత లేని నీటిని తాగాలి. దీనివల్ల శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుని, అనారోగ్యం పాలవుతున్నారు.

ప్లాంట్లను వేగంగా పునరుద్ధరిస్తాం..

జిల్లాలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లలో మరమ్మతులకు గురైన వాటిని గుర్తించి, వెంటనే వివరాలు పంపాలని హెచ్‌ఎంలను ఆదేశించాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే సత్వరమే పరిష్కరించి ప్లాంట్‌లన్నింటినీ వినియోగంలోకి తీసుకువస్తాం. విద్యార్థులను నిత్యం తాగునీరందించేలా చర్యలు తీసుకుంటాం.

- .ఉషారాణి, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

ఐదేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేశారు..

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో ప్లాంట్ పనిచేస్తున్నా బోరులో నీళ్లు లేవనే సాకుతో ఆర్వో ప్లాంట్‌ను వినియోగించకుండా మూలపడేశారు. దీంతో సామగ్రి తుప్పుపట్టి పోయాయి. హెచ్‌ఎం నిర్లక్ష్యంతోనే రూ. లక్షలు విలువ చేసే ప్లాంట్ వృథాగా ఉంది. ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థులకు మినరల్ వాటర్‌ను అందించాలి,



వలేటివారిపాలెం హైస్కూల్‌లో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్

సొగసులే పెట్టుబడిగా...
వలపు వల !

అమ్మ చందమామను చూపించి చిన్నారులకు అన్నం పెట్టేరోజులు పోయాయి. సెల్‌లో రీల్స్ చూపిస్తూ భోజనం తినిపించే రోజులు వచ్చేశాయి. విద్యార్థులను ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పే రోజుల నుంచి ఆన్‌లైన్ క్లాసులకు సెల్‌ఫోన్ తప్పనిసరన్న కాలం వచ్చేసింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ప్రపంచమంతా సెల్‌ఫోన్ రూపంలో అరచేతిలోకి వచ్చేసింది. సెల్‌వల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతోంది. ప్రస్తుతం 13 ఏళ్లు దాటిన వారి నుంచి 30 ఏళ్లలోపు యువత హనీ ట్రాప్, న్యూడ్ వీడియో కాల్స్ ఉచ్చులో చిక్కుకొని భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.


- నెల్లూరు(క్రైం),ఆంధ్రజ్యోతి)

- హనీ ట్రాప్‌లో చిక్కుకుంటున్న యువత
- వాట్సప్‌లో హాయ్.. అంటూ మెసేజ్‌లు
- ఆపై న్యూడ్ వీడియో కాల్స్‌తో ఆకర్షణ
- అనంతరం రికార్డింగ్ చేసి బ్లాక్‌మెయిల్
- అడిగినంత నగదు చెల్లించాలని డిమాండ్
- ఏఎస్పీకి జనసేన ఫిర్యాదు

సెల్ రింగ్ అవుతుంది... ఎత్తి హలో ఎవరు.. అనగానే ఓ మహిళ 'హలో మాట్లాడేది రాముయేనా..' అంటూ తియ్యటి గొంతుతో పలుకరిస్తుంది. కాదని చెప్పడానికి కొందరి మనసులు అంగీకరించక పోయినా, నాపేరు పలానా అంటూ చెబుతారు.... వెంటనే ఆ మహిళా సారీ.. అండీ రాంగ్ కాల్.. అంటూ ఫోన్ కట్ చేస్తుంది. ఇక రాత్రి అదే నెంబర్ నుంచి వాట్సప్‌లో సారీ వేరేవారికి ఫోన్ చేయబోయి మీకు చేశా..నంటూ ఓ మెసేజ్ వస్తుంది. యువత రేసుగుర్రాల్లా ఆ.. పర్లేదండీ అంటూ గొంతుకలుపుతారు. ఇంకేముంది రెండు,మూడు రోజులు వాట్సప్‌లో గంటల తరబడి మాటలు... ఫొటోలు పంపుకోవడం చేస్తారు. ఇక నాలుగోరోజు రాత్రి అసలు కథ మొదలవుతుంది. మాటలు దాటి ఇక నేరుగా వీడియో కాల్‌లో మాట్లాడుకుందామా.. అన్న చాటింగ్ ప్రారంభమవుతుంది అందుకు ఆ మహిళ సరేనంటూ మెసేజ్ పెడుతుంది. వీటితోపాటు ఫోన్‌కు ఓ లింక్ రావడం.. అవి ఓపెన్ చేస్తుంటే నేరుగా మహిళల ఫోన్ వీడియోకాల్ రింగ్ అవుతుంది. దీంతో ఆ మహిళ మాటలు కలిపి కొంచెం కొంచెం దుస్తులు విప్పుతూ యువకులను ఆకర్షిస్తారు. చివరిగా బ్రా వరకు చూపించి ఇకపై దుస్తులు విప్పాలంటే ఖాతాకు నగదు పంపాలంటూ చెబుతారు. అప్పటికే ఉద్రేకపడిన యువకులు ఖాతాకు నగదు పంపుతూ న్యూడ్ వీడియో కాల్‌లో మాట్లాడారు.

అసలు అనుమానించరు..

వాట్సప్‌లో మాట్లాడుతున్నది అసలు మహిళా... కాదా అన్న విషయాన్ని కూడా యువకులు అనుమానించరు, ఆలోచించరు. ఇక వీడియో కాల్‌లో మాట్లాడుతూ మాట్లాడుతూ చాలా దూరమే వెళ్లిపోతారు. ఏవేవో వికృత చేష్టలు చేస్తుంటారు. వీటిని అవతల వారు రికార్డ్ చేస్తూ ఉంటారు. ఇలా రెండు,మూడు రోజులు యువకులు మాట్లాడిన బూతు మాటలు, వికృత చేష్టాలు అన్నీ గంటల సమయం రికార్డ్ అవుతాయి. ఇక వారు ఆడుతున్న ఆటకు ముగింపు పలికే సమయం వచ్చేసింది. దీంతోపాటు వారు పంపే లింక్‌లన్నింటికి ఓకే కొడుతూ ఉండటంతో మన ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్లు, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఇలా అనేక సామాజిక మాధ్యమాలన్నింటిలో వారు చొరబడి పోతున్నారు. చివరికి మన గుట్టు మొత్తం వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది.



ఏఎస్పీకి జనసేన ఫిర్యాదు

ఇలాంటి వీడియో కాల్స్ రికార్డింగ్‌పై జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఇటీవల ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకి ఫిర్యాదు చేశారు. ఎంతో మంది యువకులు ఈ ట్రాప్‌లో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే చర్యలు చేపడతామని ఏఎస్పీ హామీ ఇచ్చారు.

ఫిర్యాదు చేస్తే వివరాలు గోప్యం



ఎవరైనా సైబర్ నేరాల బారినపడి నష్టపోతుంటే..లేక వేధింపులకు గురవుతుంటే... సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. మీ వివరాలను గోప్యంగా ఉంచి విచారణ చేపడతాం. ఇప్పటికే హనీట్రాప్, న్యూడ్ వీడియో కాల్స్ వంటి సైబర్ నేరాలపై జిల్లాలోని యువతకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

-జీ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ

వీడియోలు పంపి బెదిరింపులు

ఇక ఉదయాన్నే వాట్సప్ ఆన్ చేస్తూనే ఓ వీడియో వస్తుంది. ఆ వీడియోను చూస్తూనే మనవారికి గుండె పగిలిపోతుంది. వారు చేసిన వికృత చేష్టలను వారే చూసుకుని ఛా... నేను ఇంతలా చేశానా... అనుకొని బాధపడుతూ వీడియోను డిలేట్ చేయండి.. అని మెసేజ్ పెడతారు. వెంటనే ఓ ఫోన్ వస్తుంది. హలో అనగానే.. ఎలా ఉన్నాయి వీడియోలు... మీరు మంచి రసికులే.. వీడియో కాల్‌లోనే ఎంతలా చేస్తున్నారు...అంటారు. ఎవరుమీరని ప్రశ్నిస్తే అవన్నీ నీకు అనవసరం.. నా అకౌంట్ నెంబరు పెడతాను వెంటనే నగదు వేయాలి.. లేకుంటే వీడియోను మీ ఫోన్ కాంటెక్ట్‌లో ఉన్న నెంబర్ల వాట్సప్‌కు, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పెడతాను.. అంటూ బెదిరింపులు ప్రారంభమవుతాయి. చేసేది లేక కొందరు డబ్బులు అకౌంట్‌లో డబ్బులు వేస్తే... మరి కొందరు బేరాలు ఆడి కొంత నగదు వేసి తప్పించుకుంటారు.

నగదు కోసం చోరీలకు పాల్పడుతూ...

బ్లాక్‌మెయిల్ చేసే వారు అడిగినంత నగదు ఇవ్వలేక, న్యూడ్ వీడియో కాల్స్‌కు బానిసలుగా మారిన యువత ఇంట్లోని బంగారు నగలను, నగదును గుట్టుచప్పుడు చోరీ చేసి తీసుకెళుతున్నారు. ఆ నగలను కుదవ వ్యాపారులకు, ప్రైవేటు సంస్థల్లో కుదవ పెడుతున్నారు. నగలు కుదవ పెట్టుకొని నగదు ఇవ్వక పోవడంతో మధ్యవర్తులు యువతకు దగ్గరవుతున్నారు. వారి పేరుపై నగలను కుదవ పెట్టించి నగదు ఇస్తున్నారు. అయితే ఈ విషయాలు కుటుంబసభ్యులకు తెలిసిపోతుండడంతో యువత మానసికంగా చితికిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అయితే బాధితులు ఎవరూ కూడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు, కుటుంబసభ్యులకు చెప్పుకునేందుకు ముందుకు రావడం లేదు.



నిరుపయోగంగా రైతు సేవా యంత్రాలు

రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు వ్యవసాయశాఖ రైతుసేవా కేంద్రాలకు ఇచ్చిన మిషన్లు నిరుపయోగంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ఒక్కో మిషనుకు రూ. 80 వేలు వెచ్చించి అన్ని కేంద్రాలకు వీటిని అందజేశారు. రైతుసేవా కేంద్రం పరిధిలోని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం ఇందులో రిజిష్టరు చేయడంతో పాటు వాటిని పంపిణీ చేసే సమయంలో రైతుల వివరాలు కూడా వ్యవసాయశాఖ సిబ్బంది ఇందులో నమోదు చేయాలి. అయితే ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడా వాటిని ఉపయోగిస్తున్న దాఖలాలు లేవు. ఇచ్చి నాలుగేళ్లయినా వీటికి ఇంటర్‌నెట్ కోసం ఫైబర్‌నెట్ కనెక్షన్ ఇంతవరకు ఎక్కడా ఇవ్వలేదు. కలువాయిలో రైతు సేవా కేంద్రాలకు భవనాలు లేకపోవడంతో వాటిని సచివాలయంలో ఉంచారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో పెన్నా పొర్లుకట్టను ఇసుకాసురులు, మట్టిమాఫియా తవ్వేశారు. ధనార్జనే ధ్యేయంగా మట్టి మాఫియా పొర్లు కట్టను పూర్తిగా తవ్వేసి తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా పొర్లుకట్ట కనుమరుగైంది. రెండేళ్ల కిందట భారీ వర్షాలతో పెన్నా నది ప్రవాహంతో కోవూరు పరిసర గ్రామాల్లోకి నీరు ప్రవేశించి తీవ్ర ఆస్తినష్టం కలిగించింది. కోనమ్మతోట, స్టౌబీడీ కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఇసుక మట్టి మాఫియా దురాగతానికి గుర్తుగా పెన్నానది పొర్లుకట్ట ప్రాంతం పోతిరెడ్డిపాళెం సమీపంలో ఇప్పటికీ ఇలా దర్శనమిస్తోంది.

- కోవూరు(ఆంధ్రజ్యోతి)

పెన్నా పొర్లుకట్టను తవ్వేశారు..!





ప్రాణాలకేదీ రక్షణ ?

మండలకేంద్రంలోని ట్రాన్స్‌కో హెల్పర్ ఎలాంటి సేఫ్టీ కిట్లు ధరించకుండా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం మాత్రం ఏ కిట్లు ఇవ్వకపోయినా ప్రమాదకరంగా విద్యుత్ పనులు చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా స్తంభం ఎక్కుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు సరి చేస్తున్నారు. ఏ క్షణం ఏ ప్రమాదం పొంచి ఉంటుందో మరి..

- అల్లూరు(ఆంధ్రజ్యోతి)

కార్డుదారులకు ఇబ్బంది లేకుండా సరుకులివ్వండి

● ఎండీయూ వాహనదారులకు పట్టాభి సూచన



పట్టాభిరామిరెడ్డితో ఎండీయూ సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుదారులకు ఇబ్బంది కలుగకుండా ఇంటింటికీ నిత్యావసర సరకులను సరఫరా చేయాలని ఎండీయూ వాహనదారులకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సూచించారు. ఆదివారం ఎండీయూ అసోసియేషన్ నాయకులు నెల్లూరులో పట్టాభిని ఆయన నివాసంలో కలిశారు. వారి సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ సరకులు పంపిణీ చేసిన తరువాత ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం డబ్బు తీసుకోవాలన్నారు. ఎండీయూ వాహనదారు ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

కూరగాయల వ్యాపారికి బురిడీ

● రూ.20 వేల నగదు అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కూరగాయాలు కావాలంటూ బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్‌లోని ఓ కూరగాయాల దుకాణం వద్దకు బైక్‌లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు వ్యాపారిని బురిడీ కొట్టించి రూ.20వేలు అపహరించుకెళ్లిన ఘటన ఆదివారం ఉదయం జరి గింది. వివరాల మేరకు.. కూరగాయల వ్యాపారి పులగంటి శ్రీనివాసులు దంపతులు దుకాణంలో ఉండగాఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి కూరగాయలు కావాలని హడావిడిచేశారు. దుకాణాదారులు వ్యాపారంలో బిజీగా ఉండడం చాకచక్యంగా దుకాణంలోని క్యాష్‌బాక్స్‌లో ఉన్న రూ.20వేలు దోచుకుని మళ్ళీ వస్తామంటూ బైక్‌లో వెళ్లిపోయారు. ఆ తరువాత దుకాణాదారులకు క్యాష్‌బాక్స్‌లో ఉండాల్సిన నగదు లేకపోవడంతో ఖంగుతిని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం),నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : అనధికార మద్యం విక్రయాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ నెల్లూరు-1 అధికారులు నెల్లూరు నగరంలో ఆదివారం దాడులు నిర్వహించారు. డైకాస్‌రోడ్డు సెంటర్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంగళరావ్‌నగర్‌కు చెందిన వీ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 25 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. మైపాడురోడ్డు సమీపంలో బహిరంగంగా మద్యం తాగుతున్న సురేంద్రబాబు, గౌస్‌బాషాలపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఎస్ఐ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

275 కేసులు.. రూ.1.16లక్షల జరిమానా

● జిల్లాలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలోని కూడళ్లు, హైవే ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ వంటిని నిర్మూలించ డంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆటో సైడ్ సీటింగ్, నెంబరు ప్లేట్ లేకపోవడం, అనధికార పార్కింగ్ వంటి వాటికి జరినామా విధించాలని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఓపెన్ డ్రింకింగ్ 29 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 19, ఎంవీ యాక్ట్ కేసులు 227 నమోదు చేసి రూ.1,16,635 నగదు అపరాధ రుసుము విధించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు

8 కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 8 కేజీల గంజాయితో రవాణ చేస్తున్న వ్యక్తిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ నెల్లూరు రూరల్ సీఐ ప్రసన్నలక్ష్మి తెలిపారు. స్టేషన్‌లో ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న బస్సును తనిఖీ చేయగా అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి గ్రామాని కి చెందిన వనుము లవరాజు 8 కేజీల గంజాయితో ప్రయాణిస్తున్నట్లు గుర్తించామన్నారు. అతడిని అరెస్ట్ చేసి గంజాయిని, నిందితుడి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో సీఐ ప్రసన్నలక్ష్మి సిబ్బంది

ముసునూరులోని సిమెంట్ దుకాణంలో చోరీ

● కౌంటర్‌లోని రూ.60వేలు అపహరణ

● వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీం సభ్యులు

కావలి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరులోని జైశంకర్ స్టీల్, సిమెంట్ దుకాణంలో చోరీ జరిగినట్లు ఆదివారం షాపు యజమాని తుళ్లూరు నరేష్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ముసునూరు ట్రంక్‌రోడ్డులోని కాఫీ షాపు సైడు నుండి పక్కనే ఉన్న సిమెంట్ దుకాణంలోకి ప్రవేశించేందుకు రేకులను ఏర్పాటు చేశారు. దుండగులు వాటిని తొలగించి లోపలికి ప్రవేశించారు. శనివారం అమ్మకాలు చేయగా రూ.60వేలు వచ్చాయి. ఆదివారం సిమెంట్‌తో వచ్చే లారీకి కట్టేందుకు కౌంటర్‌లో ఉంచారు. ఆ నగదు అపహరించుకు వెళ్లారు. నెల్లూరు నుండి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు స్వీకరించారు. రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	87
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	166
స్కిన్‌లెస్	186
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7519
వెండి కిలో ధర	రూ. 93,800
వెండి ఒక గ్రాము	రూ.96.80

ఫీజుల కోసం విద్యార్థులను వేధించొద్దు : కలెక్టర్

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఫీజులు సకాలంలో చెల్లించలేదని విద్యార్థులను వేధించొద్దని కలెక్టర్ ఆనంద్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను ఓ ప్రకటనలో ఆదేశించారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదనే కారణంతో తరగతులకు, ప్రాక్టికల్స్‌కు విద్యార్థులను హాజరు కానివ్వకపోవడం, పాస్ సర్టిఫికెట్లు ఇవ్వక పోవడం వంటివి ప్రభుత్వ దృష్టికి వస్తున్నాయన్నారు. విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే సంబంధిత కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలలకే విడుదల చేస్తామని, పాత బకాయిలు కూడా క్రమంగా విడుదల చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆదేశాలను తెలియచేయాలని కలెక్టర్ సూచించారు.

రెసిడెన్షియల్ శిక్షణను బహిష్కరించండి : ఫ్యాప్టో

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణను ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు బహిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక(ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ సురేంద్రరెడ్డి, కార్యదర్శి మాసా ప్రసాద్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు జిల్లా పరిధిలోనే శిక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ శిక్షణకు హాజరవుతుండడంతో ఉపాధ్యాయులు అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు దీనిపై పునరాలోచన చేసే వరకు అందరూ కూడా శిక్షణను బహిష్కరించాలని కోరారు.

27న ఆర్చరీ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 27న జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు డిసెంబరు 3 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9441955334 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మేలైన వరి వంగడాల ఎంపిక ముఖ్యం

● మార్కెట్‌లోనూ మంచి డిమాండ్

● జాగ్రత్తగా సాగుచేస్తే అధిక దిగుబడులు

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యం. మార్కెట్‌కు అనుగుణంగా మంచి వంగడాల ఎంపికకు ప్రతిరైతు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు కూడా చెబుతున్నారు. ఈ క్రమంలో మన జిల్లాకు అనువైన, మార్కెట్‌లో మంచి ధర లభించే కొన్ని రకాల వరి వంగడాలను జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి రైతులకు వివరించారు.

- నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి



స్వల్పకాలిక వరి వంగడాలు అయిన కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048లు అధికవర్షాలను, చీడపీడలను తట్టుకోవడం, పిలకల సంఖ్య పెరగడంతోపాటు తక్కువ కాలపరిమితిలో పంట చేతికొస్తుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, పాటిస్తూ, రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఆమె తెలిపారు. మార్కెట్‌లో సర్టిఫైడ్ విత్తనాలనే కొనాలని, అన్ని రకాల వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అయితే క్షేత్రస్థాయిలో రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్న, మార్కెట్‌లో మంచి ధర లభిస్తున్న కొన్ని ఏ-గ్రేడ్ వరి రకాలను అవగాహన కోసం తెలియజేస్తున్నామని చెప్పారు.

● గాలులు, వర్షాలను తట్టుకునే బీపీటీ -5204

బాపట్ల వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారు కనుగొన్న సర్టిఫైడ్ ఏ-గ్రేడు రకం బీపీటీ (బాపట్ల). అయితే 140 నుంచి 160 రోజులకు పంట చేతికొస్తుంది. ఇది భోజనానికి ఎంతో బాగుంటుంది. వరి పిలకలు అధికంగా వస్తాయి. ఈదురు గాలులకు, వర్షాలకు పంట వాలిపోకుండా ఉంటుంది. భారీ వర్షాలు, వరదలను సైతం తట్టుకుంటుంది. ముదురు నారు కూడా నాటుకోవచ్చు. అయితే పిలక దశలో ఆకులు, మెడ వద్ద అగ్గితెగులు సోకే అవకాశాలు ఎక్కువ. అలాగే సుడిదోమ పోటు ఉంటుంది. కానీ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

● మంచి ధర పలుకుతున్న ఆర్ఎన్ఆర్-15048

ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్న వరి రకం ఆర్ఎన్ఆర్(రాజేంద్రనగర్)15048. తెలంగాణకు చెందిన వరి వంగడం ఇది. షుగర్ లెస్ రకం అనికూడా అంటారు. అగ్గితెగులు, పాముపొడను తట్టుకునే శక్తి ఎక్కువ. 100 నుంచి 125రోజుల్లో పంట చేతికందుతుంది. అయితే ఈదురు గాలులకు, వర్షానికి పంట వాలిపోతుంది. ముదురునారులో పిలకల సంఖ్య తగ్గుతుంది. కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఎక్కువ.

● పిలకలు అధికంగా వచ్చే కేఎన్ఎం-1638

ఎక్కువ వరి పిలకలు వచ్చే కేఎన్ఎం(కూనారం) తెలంగాణకు చెందిన వరి వంగడం. అగ్గితెగులు, పాముపొడను తట్టుకుంటుంది. ఈదురు గాలుకు, వర్షాలకు వాలిపోకుండా ఉంటుంది. తినేందుకు బాగుండే ఏ-గ్రేడ్ రకం. పురుగుల ఉధృతి తక్కువగా ఉంటుంది. 100 నుంచి 125 రోజుల్లో పంట చేతికొస్తుంది. మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. అయితే దీనికి కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే నైట్రోజన్ ఎక్కువగా వాడితే సుడిదోమ ప్రభావం పెరుగుతోంది.

వ్యర్థ పదార్థాలతో, తక్కువ ఖర్చుతో కళాఖండాలు, అబ్బురపరిచే ఆకృతులు చేయడంలో సూక్ష్మ కళాకారుడు యాచవరంకు చెందిన ఆలూరు రాముఆచారి సిద్ధహస్తుడు. కార్తీకమాసం 4వ సోమవారాన్ని పురస్కరించుకుని ఆదివారం బియ్యపు గింజపై సూక్ష్మశివలింగం ఆకృతిని తయారు చేసి ప్రదర్శించారు. దీనిపై రాముఆచారిని పలువురు అభినందించారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



బియ్యపు గింజుతో శివలింగం

తీవ్ర పని ఒత్తిడిలో సచివాలయ ఉద్యోగులు

● వీడబ్ల్యూఎస్‌జీఏ జిల్లా అధ్యక్షుడు బషీర్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర పని ఒత్తిడితో సచివాలయ ఉద్యోగులు సతమతమవుతున్నారని గ్రామవార్డు సచి వాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం నెల్లూరులోని ఏపీజీఈఏ కార్యాలయంలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. బషీర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగు లకు ఏకకాలంలో పలు శాఖల విధులు అప్పగించమే కాకుండా ఆయా శాఖ ల ఉన్నతాధికారులు ఒకే సమయంలో పర్యవేక్షిస్తూ, షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజీఈఏ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీ ఈఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బషీర్ అహ్మద్

కావలి ఐఎంఏకు మూడు రాష్ట్ర అవార్డులు

కావలి, నంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి బ్రాంచికి మూడు రాష్ట్ర అవార్డులు వచ్చాయి. రాష్ట్ర ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గుంటూరులో జరిగిన కార్యక్రమంలో కావలి ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ సుబ్బారావు, కార్యదర్శి గోపి, కోశాధికారి శివప్రసాద్ పాల్గొని ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్, జాతీయ కార్యదర్శి అనీల్‌కుమార్‌ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ విషయంపై ఆదివారం పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో కావలి శాఖ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐఎంఏ చిన్నబ్రాంచ్‌ల్లో కావలి బ్రాంచ్‌కు స్టేట్ బెస్ట్ బ్రాంచ్, బెస్ట్ సెక్రటరీ, సామాజిక సేవాకార్యక్రమాల నిర్వహణలో బెస్ట్ అవార్డులు దక్కడం అరుదైన గుర్తింపు అని పేర్కొన్నారు.



ఐఎంఏ ప్రముఖుల నుంచి అవార్డులందుకుంటున్న డాక్టర్లు సుబ్బారావు, గోపి, శివప్రసాద్

హామీల నిలిపివేతతో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం

● మత్స్యకార సంఘం అధ్యక్షుడు బసుంగారి గోవింద్

ముత్తుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం తమకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో పోర్టు ప్రభావిత, నిర్వాసిత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ సముద్ర తీర ప్రాంత మత్స్య కార సంఘం అధ్యక్షుడు బసుంగారి గోవింద్ తెలిపారు. ముత్తుకూరు బీసీ భవన్‌లో ఆదివారం ఏపీ సముద్ర తీర ప్రాంత మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో కృష్ణపట్నం పోర్టు ప్రభావిత, నిర్వాసిత మత్స్యకార గ్రామాల కాపుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముత్తుకూరు, తిరుపతి జిల్లా చిల్లకూరు మండలాలకు చెందిన 16 గ్రామాల మత్స్యకారులు, గ్రామ కాపులు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కృష్ణ పట్నం పోర్టు గత యాజమాన్యం ఇచ్చిన హామీలను అదాని కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం ఆపివేయ డం దారుణమన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న 20కిపైగా సమస్యలు పరిష్కారం కోసం చేపట్టబోయే కార్యక్రమాల విధి విధానాలను నిర్ణయించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు, గ్రామాల కాపులు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మత్స్యకార కాపులు

సోమశిలకు 5,294 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 5,294 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.770 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 2100, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఏపీహెచ్ఎంఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నారాయణరెడ్డి

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (ఏపీహెచ్ఎంఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరులోని వైవీ లయన్స్ భవన్ సమావేశ మందిరం లో ఆదివారం ఏపీహెచ్ఎంఏ జిల్లా మహాసభలు, రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగాయి. నారాయణరెడ్డి మాట్లాడుతూ కామన్ సర్వీస్ రూల్స్ అమలు పరిచేలా అందరూ పోరాడాలన్నారు. యాప్‌ల ప్రభావాన్ని తగ్గించేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని కోరారు. సాంకేతిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అపార్ పూర్తికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీ హెచ్ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో బోధనేతర సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఉండేలా రాష్ట్ర విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆపార్ నమోదు, పదో తరగతి నామినల్ రోల్స్ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో హెచ్ఎంలకు రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించడం సరికాదన్నారు. అనంతరం సమస్యలపై సంఘం చేపట్టబోతు న్న కార్యాచరణపై ఏకాభిప్రాయ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణ, ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాసరావు, కోశాధికారి చలపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ రెడ్డి

సా...గుతున్న వర్సిటీ క్రీడలు

● రెండోరోజూ పూర్తికాని వైనం

● క్రీడాకారుల్లో అసహనం

నెల్లూరు(విద్య ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల మహిళల క్రీడలు, ఎంపికల షెడ్యూల్ పూర్తయినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం శనివారం తొలి రోజున మూడు క్రీడలకు ఫైనల్స్ పూర్తి చేయాల్సి ఉన్నా, నిర్వహణ లోపాల కారణంతో ఖోఖో పోటీలు మాత్రమే పూర్తి చేశారు. దీంతో హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, యోగా పోటీలను ఆదివారం కూడా నిర్వహించారు. అయితే రెండోరోజు బాల్‌బ్యాడ్మింటన్, యోగా పోటీలను మాత్రమే పూర్తి చేసి బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీలను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు. వీరంతా సోమవారం జరిగే పోటీల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే జరిగిన పోటీల్లో కూడా కొన్ని కళాశాలలకు చెందిన క్రీడాకారులే ఫైనల్స్‌కు చేరుకోవడం, వారే విజేతలు కావడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా, మంగళవారం నుంచి కావలిలో పురుషుల వర్సిటీ కళాశాలల క్రీడా పోటీల ఎంపికలు జరగనున్న నేపథ్యంలో మహిళల పోటీలను సోమవారం అయినా పూర్తి చేయాలని పలు కళాశాలల నిర్వాహకులు కోరుతున్నారు. ప్రస్తుత క్రీడల్లో ఖోఖో విభాగంలో డీకేడబ్ల్యూ కళాశాల జట్టు ప్రథమ స్థానం, కావలి జేబీ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో అలెక్సా ప్రథమ, డీకేడబ్ల్యూ ద్వితీయ స్థానాలు, యోగాలో జెనెక్స్ ప్రథమ, డీకేడబ్ల్యూ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీల్లో కావలి జేబీ కళాశాల, అలెక్సా కళాశాల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు


మాలకొండ ప్రజలతో మాట్లాడుతున్న ఫారెస్టు ఆఫీసర్ సురేష్

వలేటివారిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు ఆఫీసర్ సురేష్ హెచ్చరించారు. ఆదివారం మాలకొండలో జాతీయ రహదారి సమీపంలో నిర్మిస్తున్న కట్టడాలను ఆయన పరిశీలించారు అటవీ, దేవదాయ, రెవెన్యూ శాఖల స్థలాలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రభుత్వ స్థలంలోని చెట్లు నరికివేసిన వ్యక్తిపై కేసు పెడతామన్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లోని చెట్లు నరికినా చర్యలు తప్పవన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ లోని 19వ వార్డులో దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో టీడీపీ సభ్యత్వాలు ఆదివారం ము మ్మరంగా ప్రారంభించారు. ప ట్టణ అధ్యక్షుడు తుమ్మల చం ద్రారెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, వైస్ చైర్మన్ సర్దార్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాలు చేయించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ గందర్ల వేణు, సయ్యద్ అస్లాం, బీసీ నాయకులు వలిపి వెంకటయ్య, సుబ్బరాయుడు, సుబ్బయ్య, తిరుపాలు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి నివాసంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి, సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వాల నమోదు చేపట్టాలన్నారు. సభ్యత్వాల నమోదులో ఉదయగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఓబులరెడ్డి, మాబాషా, మట్ల లక్ష్మయ్య, రామయ్య, బాబు, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం


ముత్తరాశిపాలెంలో చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులు

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్తరాశిపాలెంలో ఎన్ఆర్ఈజీయస్ నిధులు రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్ర రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బాణా శ్రీనివాసులురెడ్డి, మాఘం గిరిబాబు, చరణ్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.1.25 కోట్లు మంజూరు

కలువాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాలుగు రోడ్ల మరమ్మతు పనులకుగాను రూ.1.25 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులకు త్వరలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు టెండర్లు పిలవనున్నారు. ఆదూరుపల్లి సెంటర్ నుంచి పెంచలకోన రోడ్డు మరమ్మతులకు రూ.50లక్షలు, పొదలకూరు-సోమశిల రోడ్డు నుంచి చవటపల్లి, వెదనపర్తి మీదుగా వెరుబొట్లపల్లి రోడ్డుకు రూ.30లక్షలు, పొదలకూరు-సోమశిల రోడ్డు నుంచి చింతలాత్మకూరు రింగ్ రోడ్డుకు రూ.25 లక్షలు, పొదలకూరు-సోమశిల రోడ్డు నుంచి సీతారాంపల్లి, రామన్నగారిపల్లె, చింతలపాళెం మీదుగా రోడ్డుకు రూ.20లక్షలు మంజూరయ్యాయి. పొదలకూరు-సోమశిల మెయిన్‌రోడ్డుకు ఇప్పటికే రూ.12లక్షలతో వెంకటరెడ్డిపల్లి, కలువాయి టౌన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సీసీ దినోత్సవం



సర్టిఫికెట్లను అందజేస్తున్న శానం హరి, కల్లయ్య

కావలి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళ రావు నగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానో పాధ్యాయులు హయ్యూల్ హయూమ్ అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జి శానం హరి, పాఠశాల కమిటీ చైర్మన్ కల్లయ్య పాల్గొని కేడెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి, వైస్ చైర్మన్ చల్లా శ్రీను పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై పశువుల సంచారం

● ప్రమాదాల బారిన వాహనదారులు


చింతలగుంట వద్ద గేదెను తప్పించబోయి బోల్తాపడ్డ మినీ లారీ (ఫైల్)


సోమగలరేగడ వద్ద వాహనం ఢీకొని మృతి చెందిన గేదె (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలంలోని 565, 167-బీజీ జాతీయ రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో రహదారులపై సంచరించే పశువులు దీపాల వెలుగులో కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల మండలంలోని చింతలగుంట సమీపంలో 565 జాతీయ రహదారిపై ఓ మినీ లారీ గేదెను తప్పించబోయి బోల్తాపడడంతో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. బ్రహ్మేశ్వరం, సోమగలరేగడ, శ్రీరామ్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదాలలో గేదెలు మృత్యువాత పడడమే కాకుండా వాహనాలు దెబ్బతిన్నాయి. ఇలా రేయింబవళ్లు రహదారులపై పశువుల సంచారంతో అవి ప్రమాదానికి గురై అటు పాడి రైతులు, ఇటు వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశు యజమానులు వాటిని సంరక్షించుకునేలా చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

ధ్యానం దివ్య ఔషధం

వింజమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లంకణం పరమ ఔషధం, ధ్యానం దివ్య ఔషధమని ఖమ్మం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యకురాలు గ్రాండ్ మాస్టర్ శైలజ అన్నారు. శ్రీవేదవ్యాసా వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాటాడుతూ ధ్యానంతో వ్యాధులు దూరమవుతాయన్నారు. డిసెంబరు 21వ తేదీ నుంచి 31 వరకు జరుగు పత్రీజీ ధ్యాన మహాయాగానికి అందరూ హాజరుకావాలని కోరారు. అనంతరం శాకాహారం గొప్పతనాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, హజరత్, చిన్న, రవిచంద్ర, వెంకటేశ్వర్లు ఆచారి, జానకిరామిరెడ్డి, అంకిరెడ్డి, సుప్రజా, ధ్యానులు పాల్గొన్నారు. శివకుమార్ చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు.

అన్నదాతల్లో అలజడి

● వరి పైరుకు తెగుళ్లు ● తుఫాన్ హెచ్చరికలు ● పంటను రక్షించుకోవడానికి పాట్లు


వర్షం నుంచి పంటను రక్షించుకునేందుకు కప్పిన పట్టా

ఉదయగిరి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట ప్రస్తుతం కోత దశకు వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఓవైపు పంటపై తెగుళ్లు, మరోవైపు తుపాన్ హెచ్చరికలు అన్నదాతల్లో అలజడి రేపుతున్నాయి. కాండం తొలుచు, గొంగళి, లద్దె పురుగుల బెడద అధికంగా ఉంది. ఇటీవల వర్షాలు కురవడం, గాలిలో అధిక తేమ శాతం ఉండడంతో పొట్ట దశలో ఉన్న పంటకు అధికంగా నష్టం చేకూరుతుందని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికితోడు తుపాన్ ప్రభావంతో ఈనెల 26, 27వ తేదీల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ఉదయగిరి సబ్ డివిజన్‌లోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోత దశకు వచ్చింది. కొన్ని రోజుల్లో పంట కోత కోసి దిగుబడి ఇంటికి చేరుతుంది. కొంతమంది రైతులు కోత కోసి పంటను రక్షించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. వర్షాలు ఇలానే కురిస్తే కోత దశలో ఉన్న పంట నేలవాలి వరి పంట గింజ మొలకెత్తి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సుమారు 500 ఎకరాల్లో జిలకర మసూర, బీపీటీ తదితర రకాల వరి పంట సాగు చేశారు. వారం రోజుల్లో పంట ఇంటికి చేరుతుందనగా తుపాన్ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మందులు పిచికారీ చేయాలి

కాండం, గొంగళి, లద్దె పురుగుల నివారణకు క్లోరిఫైరిఫాస్ మందును 2.5 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు చేస్తే పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న సర్పంచు నాగలక్ష్మి

ఉలవపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దోమల బెడద నివారణకు ఆదివారం పంచాయతీ పారిశుద్య సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏరియాలో ఫాగింగ్ చేపట్టామని సర్పంచ్ నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఆల్తాఫ్, పంచాయతీ పారిశుద్య మేస్త్రీ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణారెడ్డిపాలెం పంచాయతీ నరసారెడ్డిపాలెంలోని బెల్టుషాపుపై ఆదివారం ఎస్ఐ ఉమాశంకర్ దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడ బెల్టు షాపులు నిర్వహిస్తున్నా తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట కానిస్టేబుల్లు అశోక్, నరసింహ ఉన్నారు.

●కావలి రూరల్ : కొత్తపల్లిలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అనధికార మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి చిమ్మిలి వెంకటేశ్వర్లు వద్ద ఉన్న 12మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ‘మంచిమాట’

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు భారతి సేవా సమితి సమావేశ మందిరంలో ఆదివారం మంచిమాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా జానపద కళలు అనే అంశంపై తెలుగు భారతి సేవా సమితి సభ్యుడు కొల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జానపద కళలు సామాన్య ప్రజల జీవన పరిస్థితులను ప్రతిబింబిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు అంకినపల్లె గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సలహాదారులు ఎస్‌వి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మర్రిపాడు మండల కమిటీ ఎన్నిక


రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించిన యూటీఎఫ్ నాయకులు

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 24: యూటీఎఫ్ మండల మహాసభ సందర్భంగా ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల నూతన అధ్యక్షుడిగా పి విజయ్, ప్రధాన కార్యదర్శిగా కె సుధాకర్‌తో పాటు 15మందితో ఉపాధ్యాయులు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు మోహన్‌ప్రసాద్, షేక్ నాయబ్ మాట్లాడుతూ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమానికి యూటీఎఫ్ కృషిచేస్తోందని తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.

బలిజ కాపులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి


ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న బలిజ కాపు నేతలు

కావలి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బలిజకాపులకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పెంకుల ఫ్యాక్టరీ గిరిజనకాలనీ తోట వద్దనున్న మండపంలో బలిజకాపు కార్తీక వనభోజన మహోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, సాంస్కృతిక పోటీల విజేతలకు వారు బహుమతులు అందజేశారు. చిన్నారులు, మహిళల చేసిన నృత్యాలు, కోలాటాలు అలరించాయి. సంఘం సభ్యులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కేశవులనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనభోజనాలు

బిట్రగుంట, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సయుక్తంగా కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. వనభోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉలిచి మల్లికార్జునరావు, గునుపూడి నరసింహారావు, ఇమ్మడిశెట్టి శ్రీనివాసులు, వాసవి క్లబ్ సభ్యులు ఉన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



నాగరాజును శాలువాతో సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశంలో గుర్తింపు ఉంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులైన గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజుకు ఆదివారం కందుకూరు పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో బీసీలకు మంచి గుర్తింపు ఉంటుందని నాగరాజు నియామకంతో రుజువైందన్నారు. అనంతరం యాదవ కార్పొరేషన్ డైరక్టర్ నాగరాజు మాట్లాడారు. తనకు ఈ పదవి రావటానికి కృషిచేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, రాచగర్ల సుబ్బారావు, చిలకపాటి మధుబాబు, చెరుకూరి సూర్యనారాయణ, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థినికి పాముకాటు

బిట్రగుంట, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): కప్పరాళ్లతిప్పలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని పల్లవిని శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో పులిపింజిరి పాము కాటు వేసింది. దీంతో ప్రిన్సిపాల్ పద్మాతి విద్యార్థిని కావలి వైద్యశాలకు తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ప్రస్తుతం పల్లవి ఆరోగ్యంగా ఉందని ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్

ఉదయగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులకు ఆదివారం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటుచేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దిన పత్రిలో ‘టాన్స్‌పార్మర్ల కష్టాలు’ అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మరమ్మతులకు గురైన ట్రాన్స్‌పార్మర్‌ను నెల రోజులుగా మార్చకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ట్రాన్స్‌పార్మర్‌ను ఆత్మకూరుకు తరలించి మరమ్మతులు చేయించి ఏర్పాటు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మరమ్మతులకు నోచుకోని చెరువులు


● సాగునీరందక బీడుగా మారిన ఆయకట్టు భూములు ● కంపచెట్లతో నిండిన కాలువలు


కంపచెట్లతో నిండిన సీతారామపురం ఊర చెరువు


తుమ్మచెట్లతో ఆనవాళ్లు కోల్పోయిన సాగునీటి కాలువ

సీతారామపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో సాగునీరందక పచ్చని పొలాలు బీడు భూములుగా మారిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శ్రీరంగనాయకుల స్వామి చెరువు, సీతారామపురం ఊర చెరువు కింద కాలువలు ధ్వంసమయ్యాయి. చెరువుల నిండా, కాలువల పొడవునా కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ చెరువుల కింద సుమారు 2500 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గత పదేళ్ల నుంచి స్వామి చెరువు, ఊర చెరువు కింద పంట సాగుచేసిన దాఖలాలు లేవు. దానితో చెరువులో, కాలువ పొడవునా, ఆయకట్టు భూముల్లో కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. వీటిని తొలగించడానికి ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని గత ప్రభుత్వంలో అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకుని కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, చెరువులలో కంపచెట్లు తొలగించాలని, ఇందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పదేళ్లుగా బీడుగానే ఉంచా : సింగాల సుబ్బయ్య, రైతు



మాకు స్వామి చెరువు తూము కింద భూమి ఉంది. పదేళ్ల కిందట పంట సాగు చేసేవాళ్లం. మా భూమి ఆయకట్టుకు కాలువ పొడవునా కంపచెట్లు పెరగడం, కాలువ ధ్వంసం కావడంతో నీరు రావడం లేదు. దీంతో భూమిని బీడుపెట్టేశాం.

ఎమ్మెల్యే చొరవ చూపాలి

- తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, ఎంపీటీసీ



చెరువు కింద తూముల కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలి. అపుడే అన్నీ కాలువల ద్వారా ఆయకట్టుకు నీరు చేరుతుంది. లేకపోతే కాలువ మొదటి భూముల్లోనే వృథాగా పోతుంది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవచూపి మరమ్మతులు చేపట్టాలి.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్ శశిధర్, పశుసంవర్ధ శాఖ సహాయ సంచాలకులు, ఉదయగిరి



ఉదయగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శశిధర్ సూచించారు.

ఇంటర్వ్యూ

? పశుగ్రాసం పెంపకంపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందా.

! బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద 10-50 సెంట్ల భూమిలో పశుగ్రాసం పెంచేందుకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయడంతోపాటు పెట్టుబడిని సైతం అందజేస్తాం.

? పశుగణనతో ఉపయోగాలు ఏమిటి.

! ఐదేళ్లకోసారి చేపట్టే పశుగణనతో పశువుల సంఖ్యను బట్టి ప్రభుత్వం మందుల పంపిణీ, సబ్సిడీలను అందించేందుకు వీలు కలుగుతుంది.

? ఎన్ని గోకులం షెడ్లు మంజూరయ్యాయి.

! ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో 48 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం లబ్ధిదారునికి రూ. 2.30 లక్షలు అందజేస్తుంది. ఇప్పటికే ఎనిమిది గోకులం షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు పూజలు


నాగారపమ్మను దర్శించుకున్న భక్తులు

సంగం, నవంబరు 24 (నవంబరు): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలంకరణ చేశారు. వివిద ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అంకమ్మ తిరునాళ్ల


ఆలయం వద్దకు వెళ్తున్న మహిళలు

అనంతసాగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులో ఉన్న గ్రామదేవత అంకమ్మతల్లి తిరునాళ్లు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మాకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, వెంకటరెడ్డి సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించి అన్నదానం నిర్వహించారు.

కార్తీకమాసం ప్రాధాన్యతపై అవగాహన



మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు

లింగసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యర్రారెడ్డిపాలెం, వెంగళాపురంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ ఆదివారం కార్తీక మాసం, సోమవారాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పెంచలరత్నం, నరసింహులు, నాగమ్మ, మధు, ప్రేమ్‌కుమార్, మాలకొండారెడ్డి, పెదకొండారెడ్డి, మధుసూదనరావు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కావలిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రాఘవేంద్ర కాలనీ ట్రంకురోడ్డుని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ధర్మకర్తలు గురుస్వాములు, అయ్యప్పలు పాల్గొని భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ గావించారు.

సభాస్థలం పరిశీలన

వింజమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ స్థాయి కార్యకర్తల అభినందన సభ డిసెంబరు 3వ తేదీన నిర్వహించేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అందుబాటులో ఉన్న ఎస్‌వీఎస్ కల్యాణ మండపం పక్కనే ఉన్న స్థలాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.

న్యూస్ బాక్స్

సాయి సృజన్‌కు ఫిడే ర్యాపిడ్ రేటింగ్



సృజన్‌ను అభినందిస్తున్న సుమన్

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదరంగం క్రీడలో అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్‌ను నారాయణ పాఠశాల విద్యార్థి జీ సాయిసృజన్ సాధించారని రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ తెలిపారు. నగరంలోని బాలాజీ నగర్ కేబీ చెస్ అకాడమీలో ఆదివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సృజన్ చిన్నతనంలోనే అంతర్జాతీయ రేటింగ్ సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో చెస్ అకాడమీ కోచ్ కిషోర్, డైరెక్టర్ దుర్గాభవానీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిపై అవగాహన

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధి విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణుడు ఆర్ విశ్వకుమార్ సూచించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం షుగర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కే జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై ఆదివారం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మూలాపేట కొండదిబ్బలో జీ ఓంకార్ ఒంటరిగా నివసిస్తున్నారు. ఆయన మృతదేహాలకు దహన సంస్కారాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఇతర జిల్లాలకు వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత ఇంటికి వచ్చేవారు. ఓంకార్ అన్న హరి నందితోట మెయిన్‌రోడ్డులో ఉన్న వినాయకుని గుడి పూజారి. అయితే కొన్ని రోజులుగా ఓంకార్ కనిపించకపోవడంతో హరి ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రవి ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఓంకార్ ఆచూకీ తెలిసిన వారు 9440796305 నెంబరుకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


తీవ్రగాయాలతో రోడ్డుపై పడి ఉన్న రాజ్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాల వద్ద జాతీయ రహదారిపైన ఆదివారం ఓ బైక్‌ను బొగ్గులారీ ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతసాగరం మండలం మంచాలపల్లికి చెందిన జాజికర్త రాజ్‌కుమార్(25) ఆత్మకూరు నుంచి నెల్లూరు వెళ్తుండగా రేబాల వద్ద బొగ్గులారీ నెల్లూరు నుంచి వస్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలపాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు.

జీతాల కోసం ఎదురుచూపు

రాపూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా జీతాలు అందక మండల రెవెన్యూ అధికారులు సతమతమవుతున్నారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రాపూరు రెవెన్యూ సిబ్బందికి జీతాలు పడకపోవడంతో విలవిలలాడుతున్నారు. గత రెండు నెలల క్రితం సాధారణ బదిలీలలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి రాపూరుకి తహసీల్దారుగా పీఎల్ నరసింహం బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకు గ్రామ సేవకుల నుంచి, తహసీల్దారు వరకు జీతాలు పడలేదు. ఈ విషయంపై జిల్లాస్థాయి అధికారులు చొరవ తీసుకొని జీతభత్యాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

జోరుగా వరినాట్లు


సాల్మానుపురంలో వేస్తున్న వరి నాట్లు

● పూడికతీతకు నోచని కాలువలు ● రైతులకు తప్పని అవస్థ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో ప్రస్తుత రబీ సీజన్‌లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. కానీ కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు కింద పలు ప్రాధాన కాలువలు, ఉప కాలువలు పూడికతీతకు నోచుకోక ఆ కాలువల ద్వారా సాగునీరు ముందుకు కదలక వరినాట్లకు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా మరో పక్క ఆ కాలువల్లో నీరు అక్కడక్కడా పొలాలకు చేరుతుండడంతో ఆయా ప్రాంతాల్లో నారుమళ్లు నీటమునిగి దెబ్బతింటున్నాయి. నియోజకవర్గంలో సుమారు 5 నుంచి 6వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందించి సాగునీటి కాలువల్లో పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన సొంత నిధులతో వవ్వేరు నుంచి రెండు ఊటు కాలువలు, దామరమడుగు వద్ద ప్రధాన కాలువలు, రేబాల, కాగులపాడు వద్ద ప్రధాన కాలువల్లో పూడికతీయించారు. గత ప్రభుత్వంలో పూడికతీయ్యకుండానే గత ప్రభుత్వం కోట్ల రూపాయలు స్వాహా చేస్తే ఎమ్మెల్యే సొంత నిధులతో పూడికతీయించడం విశేషం.


పెనుబల్లి వద్ద పూడిపోయిన కాగులపాడు కాలువ →

ఖాతాదారులకు మెరుగైన సేవలు

● డీసీసీబీ రాపూరు బ్రాంచి మేనేజర్ మునిచందన

రాపూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు సేవలందిస్తున్నాం. బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు సహకారంతో రాపూరు బ్రాంచ్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని ఆ బ్యాంకు రాపూరు బ్రాంచి మేనేజర్ బి మునిచందన తెలిపారు.



ముఖాముఖి

? బ్యాంకు ద్వారా ఖాతాదారులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు.

! ప్రజలకు ప్రత్యేక డిపాజిట్ పథకాల ద్వారా అత్యధిక వడ్డీ వచ్చే పథకాలు మంజూరు చేస్తున్నాం.

? బ్యాంకు ద్వారా ప్రజలకు ఎటువంటి రుణసౌకర్యాలు కల్పిస్తున్నారు.

! రైతులకు వ్యవసాయ రుణాలు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో గృహరుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, చిరు వ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, స్థిరాస్థి తాకట్టుపై ఎఫ్‌డీడీ రుణాలు, ఉన్నత చదువులకు విద్యా రుణాలు ఇస్తున్నాం.

? వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు.

! వాణిజ్య బ్యాంకులకన్నా సహకార బ్యాంకులో డిపాజిట్‌లపై అత్యధికంగా 7.60 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్‌లకు అర్ధశాతం అదనంగా ఇస్తున్నాం.

కాకాణీ.. సోమిరెడ్డిపై దుష్ప్రచారం మానుకో !

● టీడీపీ నాయకులతో కలసి కనుపూరు కెనాల్‌ను సందర్శించిన మాజీ చైర్మన్


వెంకటాచలం : కాలువను పరిశీలిస్తున్న నేతలు

వెంకటాచలం/మనుబోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాలు మానుకోవాలని కనుపూరు కెనాల్ మాజీ చైర్మన్ మస్తాన్ నాయుడు హితవు పలికారు. ఆదివారం ఆయన వెంకటాచలం మండలం కసుమూరు సమీపంలో, మనుబోలు మండలం అక్కంపేట సమీపంలో ఆయా మండలాల రైతులతో కలసి కనుపూరు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో కూర్చుని కాకాణి నోటికి వచ్చినట్లు మాట్లాడడం కాదని, కాలువల వద్దకు వచ్చి పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ప్రస్తుతం కనుపూరు కాలువలో సాగునీరు పారుతుందంటే సోమిరెడ్డి ప్రత్యేక చొరవే కారణమన్నారు. పూడిక తీత పనులను రైతులే దగ్గరుండి స్వయంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాకాణి పంటకాలువల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదన్నారు. ఇరిగేషన్ పనులు చేయకుండానే చేసినట్టుగా కాకాణి రూ.కోట్ల దోచుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు రమేష్‌నాయుడు, ధనుంజయనాయుడు, సతీష్‌నాయుడు, వల్లూరు వంశీకృష్ణ, రాఘరామయ్య, రమేష్, నూనె లక్ష్మయ్య, ఉడతా విజయ్ కుమార్, వెందోటి భాస్కర్‌రెడ్డి, పొట్టేళ్ల ప్రసాద్, కోదండరామిరెడ్డి, అమీర్‌బాషా పాల్గొన్నారు.

దీపావెంకట్ జన్మదిన వేడుకలు

వెంకటాచలం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు సమీపంలోని శివాలయంలో ఆదివారం బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె ఇమ్మని దీపావెంకట్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయంలో అయ్యప్ప భక్తులకు, గ్రామస్థులకు అన్నదానం చేశారు. కసుమూరు మస్తాన్‌వలీ దర్గాతోపాటు గ్రామంలో ఉన్న పలు ఆలయాల్లో ఆమె పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్బానాయుడు, నాగరాజురెడ్డి, బుర్ర శ్రీను, మాధవ్, అనిల్ పాల్గొన్నారు.

కమనీయం ఆదిదంపతుల కల్యాణం

మనుబోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షితాయి సంగమేశ్వర ఆలయంలో ఆదివారం ఆదిదంపతుల కల్యాణం కమనీయంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల మూలవర్లకు క్షీర, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం శివపార్వతులకు శాంతికల్యాణం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గూడూరు బజారువీధి వర్తక సంఘం సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

'వెన్నెలకంటి' సేవలు చిరస్మరణీయం

● యానాదుల సంఘాల నివాళి


రాఘవయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(హరనాథపుర), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనాభివృద్ధికి కృషి చేసిన వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయమని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య అన్నారు. నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్‌లో ఆదివారం యానాదుల సంక్షేమ సంఘం, ఆదిమ జాతిసేవా ట్రస్టు, యానాది గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాఘవయ్య 43వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పెంచలయ్య మాట్లాడుతూ వెన్నెలకంటి రాఘవయ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, నగరంలో రాఘవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, కోశాధికారి యల్లంపల్లి రమేష్, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, నగర అధ్యక్షురాలు కల్లూరు వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపల చంద్రమౌళి, యానాది గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు బూదూరు కేశవరామ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



గాంధీ ఆశ్రమంలో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇందుకూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. అలాగే జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్నెం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం జరిగింది. ముందుగా జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్, రెడ్‌క్రాస్ ఏఆర్‌వీ కన్వీనర్ బిరదవోలు వెంకిరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజులలు మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీవస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. ఉసిరిచెట్టు కింద శివుని లింగం ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, నేదురుమల్లి సుబ్బారెడ్డి, సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

పొదలకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనిర్మలానంద యోగా కేంద్రంలో యోగా గురువు సీహెచ్ పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక దీపోత్సవం, హోమం, భజనలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప, శివ, గోవింద భక్తులు భక్తిశ్రద్ధలతో భజన గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో యోగా సెంటర్ సభ్యులు, భక్తులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతల చేయూత మరువరానిది

● దేవాంగ సంఘం ఆవిర్భావ దినోత్సవంలో గిరిధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు వరుసగా విజయం సాధించడానికి చేనేత కుటుంబాలు అందించిన చేయూత మరువరానిదని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వేదగిరి క్షేత్రం ఏడుకోనేళ్ల వద్ద జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవం, కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చేనేతలు ఆర్థికంగా, సామాజికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వృత్తికి కట్టుబడి ఉన్నారని కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలకు ఆటపోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షకార్యదర్శులు సతీష్, శంకరయ్య, హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన హేమలత, దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సురేంద్ర, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి : మేయర్


పోటీల తీరును పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సామాజికంగా, ఆర్థికంగా వెనకబాటుతో ఉన్న గిరిజన కుటుంబాల్లోని విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. ఆదివారం గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో గిరిజన పోరాటయోధుడు బిర్సా ముండా జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల్లో తరచూ పాల్గొనడం వల్ల సమాజంపై అవగాహన, గిరిజన జాతి పూర్వీకుల చరిత్ర తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు జడ్పీటీసీ చేవూరు అరుణ, ఫౌండేషన్ నిర్వహకుడు చేవూరు శ్రీనివాసులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో కార్తీన వన సమారాధనలో భాగంగా ఆదివారం నగరంలోని అష్టలక్ష్మీ ఆలయంలో సామూహిక సత్య నారాయణ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. దాదాపు 600 మంది దంపతులు పాల్గొన్నారు. పండితుడు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో వ్రతం, ఉమాదేవీ సమేత నాగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతా భిషేకాలు జరిగాయి. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వేంకటశేషాచార్యులు, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి ఐ కామేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

● ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో కార్తీక మాస వేడుకలు జరిగాయి. సంఘం సర్వసభ్య సమావేశమూ నిర్వహించారు. అధ్యక్షుడిగా గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శిగా చుండూరు కృష్ణమూర్తి, ట్రెజరర్‌గా అద్దెపల్లి సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్నారి కొలపర్తి వెంకట శ్రీగుహ్య కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో టీ ప్రకాష్‌రావు, డీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో బీజేపీ విజయంపై జనసేన సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ తరఫున జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం చేసిన అన్ని స్థానాల్లో అభ్యర్థులు విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. సుబేదారుపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యధిక ప్రజల మన్నన పొందిన నాయకుడిగా పవన్ కల్యాణ్ ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో హేమచంద్ర యాదవ్, ప్రశాంత్ గౌడ్, కృష్ణారెడ్డి, ఎస్‌కే యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్స వాల్లో భాగంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం, జరిగాయి. సాయంత్రం విశేష పూలంగిసేవ, ప్రాకారోత్సవం, ఎదురుకోలు ఉత్సవం నిర్వహించి అనంతరం కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. భక్తులు భజనతో ఆలయంలో శివనామ స్మరణ మారుమోగింది. ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

● 1008 మృతికా శివలింగాలకు పూజలు ● సహస్ర దీపార్చన


శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్ పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక దీపోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. తాత్కాలిక మహాశివలింగం ఏర్పాటు చేసి మహా రుద్రాభిషేకం చేశారు. భక్తులు పుట్ట మట్టితో తయారు చేసిన 1008 శివ లింగాలకు భక్తులతో సామూహికంగా అర్చన చేయించారు. ఆ తర్వాత సహస్ర దీపార్చన, అన్నప్రసాద వితరణ జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటగురు బ్రహ్మం, కార్యవర్గ సభ్యులు, సలహాదారులు ఎంపీ ఆంజనేయులు, అర్బన్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి మేగు షణ్ముఖరావు, పర్యవేక్షించారు.

పెరుగు రామకృష్ణకు వరల్డ్ అకాడమీ సత్కారం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు మధురైనగర్‌లో ఈనెల 20 నుంచి 24వతేదీ వరకు అమెరికాలోని వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ సంస్థ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఆహ్వానితుడిగా, కార్యనిర్వాహణ కమిటీ సభ్యుడిగా నెల్లూరుకు చెందిన అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ హాజరయ్యారు. తెలుగు కవితా వైభవాన్ని విదేశీ కవులకు పరిచయం చేసి ఆంగ్లంలో కవితా గానం చేశారు. ఆయనను వరల్డ్ అకాడమీ విశ్వ అధ్యక్షురాలు, మెక్సికన్ కవయిత్రి మారియా యుజీనియా సోబెరిన్స్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియా సదస్సు అధ్యక్షురాలు డాక్టర్ సైతకుమన్, వివిధ దేశాల కవులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : పట్టాభి

కొడవలూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మండలంలో గండవరంలోని ఆయన నివాసంలో ఆదివారం జిల్లా పీడీఎస్ డోర్ డెలివరీ వ్యాన్ అసోసియేషన్ సభ్యులు ఆయనను కలసి ఘనంగా సత్కరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు అల్లం మాలకొండయ్య, తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా యాదవ వనభోజన మహోత్సవం


బుచ్చిరెడ్డిపాళెం : పూజలు చేస్తున్న భక్తులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యాదవ వనభోజన మహోత్సవం ఆదివారం నగరంలోని యాదవ్ భవన్‌లో అట్టహాసంగా జరిగింది. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బొమ్మి నాగ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుదేవ పూజ, గోపూజ, శివాభిషేకం జరిగాయి. యాదవ్ భవన్ ట్రస్టు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీద మస్తాన్‌రావు, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డాక్టర్ పిట్టి మల్లికార్జున యాదవ్, ఆల్ఫా హేచరీస్ అధినేత సుధాకర్‌యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, గుండుపల్లి భరత్ కుమార్ యాదవ్, డాక్టర్ విజయకుమార్, బీద గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రిజర్వాయర్ వద్ద...

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ వద్ద ఆదివారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమం జరిగింది. ముందుగా అర్చకులు గణపతిపూజ ప్రారంభించి శివలింగానికి రుద్రాభిషేకం అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కాకరపర్తి ప్రభాకర్, ఇనుగూరు శ్రీనివాసులు, ఇనుగూరు సుబ్బారావు, ఇనుగూరు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 25 నవంబరు 2024

వెలుగులీనుతున్న తిరుచానూరు









విద్యుద్దీప కాంతుల్లో తిరుచానూరు వెలిగిపోతోంది. గురువారం నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ క్రమంలో ఆలయం, తిరుమాడవీధులు, పుష్కరిణి, గాలిగోపురం, ఉద్యానవనం తదితర ప్రాంతాలు ఆదివారం రాత్రి విద్యుద్దీపాలంకరణతో కనువిందు చేస్తున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. గృహస్తులు (ఇద్దరు) రూ.1,116 చెల్లించి టికెట్ కొని ఈ సేవలో పాల్గొనవచ్చు. ఆలయం వద్ద కౌంటర్‌లో కరెంట్ బుకింగ్‌లో ఈ టికెట్లు పొందవచ్చు. **- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి**



హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

● దౌర్జన్యం చేసిన వారు.. పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో నిందితులు

● వీరంతా వైసీపీకి చెందిన వారే!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విధుల్లో వున్న పోలీసు హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని నలుగురు రౌడీలు దాడి చేశారు. మ్యాన్ ప్యాక్ లాక్కొని దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ నలుగురు గతంలో పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులు. వైసీపీకి చెందిన వారు. ఈ ఘటన ఆదివారం ఆర్సీ పురం జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. సుండుపల్లికి చెందిన సాయికుమార్ కారులో ఆర్సీ పురం నుంచి తిరుపతికి వస్తున్నారు. ఆర్సీ పురం జంక్షన్ దాటుతుండగా చంద్రగిరి నుంచి రేణిగుంటకు వెళుతున్న స్కార్పియో వాహనం డ్రైవరు కారును నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. ఈ ఘటనలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే రక్షక్ ఆరులో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్య, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళారు. హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్య ట్రాఫిక్ క్లియర్ చేస్తూ.. ప్రమాదంలో దెబ్బతిన్న కార్లను పరిశీలిస్తున్నారు. స్కార్పియో వాహనంలో వున్న ఆర్సీ పురం మండలం సీ.రామాపురం గ్రామానికి చెందిన ఎస్.జయచంద్రారెడ్డి, నెన్నూరుకు చెందిన మునిబాలాజీ, తిరుపతికి చెందిన ట్రావెల్ బిజినెస్ చేస్తున్న ఆర్.అన్వర్‌బాషా, తనపల్లికి చెందిన లోకేష్‌రెడ్డి.. హెడ్ కానిస్టేబుల్ షర్టు పట్టుకుని దాడి చేసి దౌర్జన్యానికి దిగారు. మ్యాన్ ప్యాక్, మొబైల్ ఫోను లాక్కొని కొట్టారు. ఈ ఘటనపై కోదండరాం మ్యాన్ ప్యాక్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చిన్నగోవిందు చెప్పారు. ఈ నిందితులపై గతంలో పద్మావతి వర్సిటీ వద్ద పులివర్తి నానిపై (ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే) జరిగిన హత్యాయత్నం కేసులో రౌడీషీట్లు ఉన్నాయని చెప్పారు. వీరంతా వైసీపీకి చెందిన వారు కావడం గమనార్హం.

కంగారు పుట్టించిన వెండి విరాళం

తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి విరాళంగా వచ్చిన వెండి పూజా సామగ్రి అధికారుల్లో కంగారు పెట్టించింది. ఈనెల 18వ తేదీన ఓ భక్తుడు 6.7 కిలోల వెండి బిందె, దీపస్తంభాలు, ప్లేట్ వంటి పూజా సామగ్రిని విరాళంగా ఇచ్చారు. ఆలయంలో అర్చకులకు అందజేసినట్టు మీడియాతో వార్తలు వచ్చాయి. అయితే భక్తుడి నుంచి తమకు ఎలాంటి వెండి వస్తువులు అందలేదని టీటీడీ అధికారులు విజిలెన్స్ అధికారులకు తెలియజేయడంతో వారు విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత భక్తుడు ఆ వస్తువులను ఆలయంలోని హుండీలో సమర్పించినట్టు తేలింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ఓటరు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్వో

ఓటు నమోదుకు యువత ఆసక్తి

● 1,019 మంది దరఖాస్తు

● రెండు రోజుల్లో అందిన క్లెయిమ్‌లు 2,435

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శని, ఆదివారాల్లో ఓటు నమోదు, సవరణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదికి 18 ఏళ్లు నిండే యువత ఓటు నమోదుకు ఆసక్తి చూపారు. ఈ రెండు రోజుల్లో 1,019 యువ ఓటర్లు నమోదుకు ఆసక్తి చూపారు. ఇక, రెండో రోజు ఓటర్ల నమోదు, సవరణకు 2,141 పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్వోలకు 1,392 క్లెయిమ్‌లు అందాయి. ఇందులో ఓటు నమోదుకు 550 దరఖాస్తులు రాగా.. విదేశాల్లోని 90 మంది ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపునకు 362, ఓటు బదిలీ, సవరణకు 390 క్లెయిమ్‌లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇలా రెండు రోజుల్లో 2,435 క్లెయిమ్‌లు అందాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు గైర్హాజరైనట్లు సమాచారం. వారిపై అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.



సైబర్ ఉచ్చులో సామాన్యులు

● వారం రోజుల్లో ఐదు ఘటనలు

● షేర్ మార్కెట్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ పుత్తూరుకు చెందిన ఒక చోటా వ్యాపారి వాట్సా‌ప్‌కు అక్టోబరులో మెసేజ్ వచ్చింది. నిఫ్టీ, ఆప్షన్ ట్రేడింగ్ ద్వారా నెలకు రూ.లక్ష సంపాదించవచ్చని, అవగాహన కోసం యూట్యూబ్ లింకులు పంపారు. ఆ మెసేజ్ నిజమని భావించిన ఆయన.. వారు సూచించిన టెలిగ్రామ్ గ్రూపులో చేరి పెట్టుబడులు పెట్టారు. విడతలవారీగా దాదాపు రూ.20 లక్షలు పెట్టుబడులు పెట్టి మోసపోయారు.

● తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఎరువులు మార్కెటింగ్ చేస్తున్న వ్యాపారి జయరామిరెడ్డి ప్రమేయం లేకుండానే వీఐపీ ఈ7 ఇన్వెస్టుమెంటు అలియన్స్ లెర్నింగ్ వాట్సాప్ గ్రూపులో ఆయన్ను ఈ నెల 21న యాడ్ చేశారు. ఈ గ్రూపులో వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఆయన డౌన్‌లోడ్ చేశారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేశారు. అతడి బ్యాంకు ఖాతాలో రూ.13.5 లక్షలు ఉన్నాయి. వీటితో ట్రేడింగ్ చేయగా.. ఆ మొత్తం రూ.24.3 లక్షలు చూపింది. విత్‌డ్రా చేసే సమయంలో ఆ యాప్ కనిపించకుండా పోయింది. ఇలా, రూ.13.5 లక్షలు నష్టపోయిన ఆయన తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాజాగా మోసపోయిన మరొకరు

తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ ఆంధ్రాబ్యాంకు కాలనీలో ఉంటున్న సతీష్ ఓ మిల్క్ కంపెనీలో లాజిస్టిక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. ఈయనకు సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ లింకు పంపారు. దీనిలో జేపీ మోర్గాన్ అనే వాట్సాప్ గ్రూపులో జాయిన్ చేయించారు. ఆ తర్వాత జేపీఎంసెక్యూరిటీ.కామ్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా స్టాక్ ట్రేడింగ్ చేయించారు. ఈయన పంపిన దాదాపు రూ.తొమ్మిది లక్షలను ఐదు బ్యాంకు అకౌంట్లలోకి డిపాజిట్ చేయించుకున్నారు. సదరు మొత్తం నగదుకుగాను అదనంగా ప్రాఫిట్‌తో కలిపి రూ.19 లక్షలు ఉన్నట్లు అతడి వాలెట్ డిస్‌ప్లేలో చూపించారు. విత్‌డ్రా చేసుకోనివ్వకుండా మీకు ఐపీవో షేర్లు మంజూరయ్యాయని చెప్పారు. దీనికి అదనంగా రూ.14 లక్షలు ఐపీవో షేర్లు కొన్న తర్వాతనే నీ అకౌంటులో వున్న రూ.8.30 లక్షలు విత్ డ్రా చేసుకోవచ్చని, లేదంటే విత్ డ్రా కాదని చెప్పారు. సతీష్ అకౌంటులో వున్న రూ 8.30 లక్షలు విత్‌డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. దీంతో మేల్కొన్న బాధితుడు సతీష్ తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాలో ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సగటున రోజుకు మూడు నుంచి నాలుగు ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక తరహా మోసాన్ని పోలీసులు పసికట్టి అవగాహన కల్పించేలోగా.. సైబర్ నేరగాళ్లు మరో తరహా మోసానికి తెరలేపుతున్నారు. సైబర్ నేరాల నియంత్రణపై తిరుపతిలో ప్రత్యేకంగా సైబర్ సెల్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని కళాశాలలు, కమ్యూనిటీ కేంద్రాలు, సీనియర్ సిటిజన్లు, ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చే వారికి అవగాహన కల్పిస్తున్నారు. బాధితులు వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్ తెలిపారు. డబ్బులు పోయిన గంటలోగా ఫిర్యాదు చేస్తే వెనక్కు రప్పించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కాగా, బాధితులకు అవగాహన లేకపోవడం, నేరగాళ్లు చెప్పే మాటలకు నమ్మి మోసపోవడం, ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరుగుతుండడంతో సైబర్ పోలీసులకు దర్యాప్తు అవరోధంగా మారుతోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్వామి ప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయ్



తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదాలు చాలా అద్భుతంగా ఉన్నాయని నటుడు శివాజీ అన్నారు. తిరుమలలో ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీలో కొత్త ధర్మకర్తల మండలి వచ్చిన తర్వాత అన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయన్నారు. అందరూ సమానం అనేలా కొనసాగుతోందన్నారు.





నేలపట్టులో సందర్శకుల సందడి

దొరవారిసత్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో పక్షుల కేంద్రంలోని విడిదిలో ఉన్న విహంగాలను చూసేందుకు తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి సందర్శకులు విచ్చేశారు. శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌ల్లో పనిచేసే ఉద్యోగులు కూడ నేలపట్టుకు వచ్చారు. చెరువుల కట్టలపైన ఉన్న వాచ్ టవర్స్, సందర్శన ప్రాంతాల నుంచి పక్షులను వీక్షించారు. వన్యప్రాణి సంరక్షణ శాఖ ఏర్పాటు చేసిన బైనాక్యులర్ల ద్వారా దూరంలో ఉండే పక్షులనూ వీక్షించారు. ఈ పక్షుల కేంద్రాన్ని జర్మనీ దేశీస్తులు సందర్శించారు. శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేసే కుటుంబం పక్షులను వీక్షించింది. ఇటువంటి పక్షుల కేంద్రం అరుదుగా ఉంటుందని వారు అభిప్రాయ పడ్డారు.

బడి 'గంట' పెరిగింది!

● హైస్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలవరకు తరగతులు

● 34 పాఠశాలల్లో నేటినుంచి ప్రయోగాత్మక పరిశీలన



తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పని వేళలు గంట పెరిగింది. ప్రస్తుతం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తుండగా, ఇకపై సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలు నడుస్తాయి. ఓ గంట సమయం పొడిగిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికోసం ప్రతి జిల్లాలో కొన్ని పాఠశాలలను ఎంపికచేసి పైలట్ ప్రాజెక్ట్ కింద కొత్త సమయం ప్రకారం నిర్వహిస్తున్నారు. ఆ మేరకు జిల్లాలో మండలానికొకటి చొప్పున 34 పాఠశాలలను డీఈవో కేవీఎన్ కుమార్ ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో సోమవారం నుంచి 30వ తేది వరకు పైలట్ ప్రాజెక్ట్ కింద కొత్త సమయాల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరగనున్నాయి. ఈ వారం రోజులపాటు ఇక్కడ ఉదయం మొదటి పిరియడ్‌ను 5 నిమిషాలు పెంచి 50 నిమిషాలు చేశారు. మిగిలిన పిరియడ్లను 40 నుంచి 45 నిమిషాలకు పెంచారు. ఉదయం, మధ్యాహ్నం బ్రేక్‌ల సమయం 5 నిమిషాల చొప్పున, భోజన విరామం 15 నిమిషాలు పెంచారు. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. దీనిని పునఃపరిశీలించాలని కోరుతున్నాయి. అయితే, విద్యా ప్రమాణాలను పెంచేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని డీఈవో తెలిపారు.

సమంజసం కాదు.

అందుకే పాఠశాలల పని గంటల పెంపు యోచన సమంజసం కాదు. 70 శాతం పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. మూడు నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి లేదా సైకిళ్లపై వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది. బాలికలకు ఇది ఎంతమాత్రం మంచిది కాదు. ఇన్నిన్ని గంటల చదువు వల్ల విద్యార్థి అభ్యసనా సామర్థ్యం తగ్గుతుంది.

- కె.ధనుంజయ నాయుడు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు

పునరాలోచించాలి

ఇప్పటికే రకరకాల యాప్‌లు, శిక్షణలు, వివిధ బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్నాం. మళ్లీ సమయం పెంపు తలకు మించిన భారంగా మారుతుంది. గ్రామీణ విద్యార్థుల స్థితిగతులు, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి.

- ఎస్.బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

సహేతుకమే

విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సహేతుకమే. పిల్లలు ఇంటికి వెళ్లిన తరువాత సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారని, మరో గంట వారు పాఠశాలలో ఉంటే చదువుకుంటారని పెద్దలు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని తల్లిదండ్రులు కూడా స్వాగతిస్తున్నారు. 30వ తేదీ వరకు అమలుచేసి ఆపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

- కె. వెంకట నాగేంద్ర కుమార్, డీఈవో

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

టీడీపీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయండి



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి సమన్వయంతో అందరూ పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస మినీఫంక్షన్ హాలులో ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ సమక్షంలో ఓజిలి మండలంలో వైసీపీకి చెందిన ఇద్దరు సర్పంచులు, 100 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. అనంతరం విజయశ్రీ మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు.నరసింహ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు పరచి పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుజ్జలపూడి విజయ కుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అంకితభావం అభినందనీయం



కార్మికులకు బహుమతులను అందజేస్తున్న ముత్తుగోవిందస్వామి

తడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఇబ్బందులు ఎదురైనా కార్మికులందరూ అంకితభావంతో పనిచేశారని అపాచీ పరిశ్రమ జీఎం ముత్తుగోవిందస్వామి అన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి సమ్మె సమయంలో రవాణా సౌకర్యం లేకపోయినా విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన సుమారు 2వేల మంది కార్మికులకు ఆదివారం కృతజ్ఞతా పూర్వక అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపాచీ జీఎం ముత్తుగోవిందస్వామి మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో సకల జనులు సమ్మెలో ఉన్నా తమ పరిశ్రమ కార్మికులు యధావిధిగా పనిచేశారని కొనియాడారు. తద్వారా పరిశ్రమకు నష్టం వాటిల్లకుండా చూశారని, కార్మికుల అంకితభావానికి కృతజ్ఞతగా వారిని కుటుంబసభ్యుల సమక్షంలో అభినందిస్తున్నామన్నారు. అనంతరం 2210 మంది కార్మికులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు కార్మికులు, వారి పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పరిశ్రమ ఏజీఎం గెవిన్‌చాంగ్, హెచ్‌ఆర్ మేనేజర్ షరీఫ్, పీఆర్ మేనేజర్ మోహన్, ఏపీఆర్‌వో భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులు నిబంధనలు పాటించాలి



ఏఈఎస్పీ ఊహశ్రీ, పక్కనే టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఈఎస్పీ ఊహశ్రీ అన్నారు. ఆదివారం ఆమె సూళ్లూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం షాపులు సమయ పాలన పాటించాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత షాపులు మూసివేయాలని, పరిసరాల్లో ఎక్కడా మద్యం విక్రయించరాదన్నారు. అలాగే షాపుల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకూడదన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఇప్పటికే సూళ్లూరుపేట, గూడూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాదాపు 50 కేసులకు పైగా నమోదు చేశామన్నారు. ఆమెతో పాటు సీఐ బాలకృష్ణ ఉన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించడం సరికాదు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సెలవురోజుల్లో ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిబంధనలు పాటటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సతీష్, దీప, సుజిత్, శశి, మధు, సుమన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధాత్రివనం పూజలు

చిల్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ధాత్రివనం పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలోని తోటలో వేదపండితుల మంత్రోచరణల నడుమ భక్తులు ధాత్రివనం పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ధాత్రివనం పూజల్లో వేదపండితులు, భక్తులు

మహిళలకు దుస్తుల అందజేత

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్ డబ్ల్యూ కళాశాలలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు వైజేపీ లయన్స్‌క్లబ్ గవర్నర్ గౌతమ్ ఆదివారం దుస్తులు, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనార్దనరావు, హనుమంతరావు, గురునాథం, మురళీ నాయుడు, శీను, మనోజ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌వీరావు, ప్రసాద్, మురళి, శివరామ్ పాల్గొన్నారు.

యంత్రాలతో వరినాట్లు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో యంత్రాలతో వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని మన్నారుపోలూరు, మంగానెల్లూరు తదితర గ్రామాల్లో కూలీల లభ్యత తక్కువగా ఉండడంతో పలువురు రైతులు యంత్రాలను తీసుకొచ్చి నాట్లు వేసుకొంటున్నారు. యంత్రాల సాయంతో ఒక గంటకు ఎకరం భూమిలో వరినాట్లు వేస్తుండగా రూ.3500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.



మన్నారుపోలూరు వద్ద వరినాట్లు వేస్తున్న యంత్రం

వరినాట్లకు కూలీల కొరత



వరినాట్లు నాట్లు వేస్తున్న పశ్చిమబెంగాల్ వాసులు

పెళ్లకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఎక్కడా కూలీలు రాకపోతుండడంతో ఇతర రాష్ట్రాల నుంచే వచ్చే వారిపైనే ఆధార పడాల్సివస్తోంది. మండలంలోని మహిళలు పెళ్లకూరు చుట్టుపక్కల ఏర్పాటైన పరిశ్రమల్లో పనిచేసేందుకు వెళ్తున్నారు. దీంతో వరినాట్లు వేసేందుకు కూలీలు దొరక్క ఇతర రాష్ట్రాల నుంచి రెట్టింపు కూలి ఇచ్చి తీసుకువస్తున్నారు. గతంలో నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.2500 ఖర్చవుతుండగా ప్రస్తుతం రూ.5500కు చేరుకుంది. పొలం చదును చేసేందుకు చెక్క తొలగానికి గతంలో రూ.1500 ఇస్తుండగా ప్రస్తుతం రూ.2200 ఇవ్వాల్సి వస్తోంది. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో చేరిన అరకొర నీటితో పొలాలకు నీరుపెట్టి దుక్కి చేసినా సకాలంలో నాట్లు వేయకుంటే నీరు నిలబడదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తే మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

పులికాట్ నగర్‌లో చోరీ

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో (కేఆర్ పాలెం) చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు... షార్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న నజీర్ పులికాట్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. ఇంట్లో ఉన్న వస్తువులను చిందవందర పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు బాధితుడు నజీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల టీడీపీ అధ్యక్షుడు కొక్కు శంకరయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని ఆదివారం సన్మానించారు. తీర ప్రాంత గ్రామాలైన కొరిడి - పేర్నాడు రోడ్డు గురించి తొలిసారిగా అసెంబ్లీలో ప్రస్తావించ డంతో ఎమ్మెల్యేను సన్మానించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దామరాయి, కడపత్ర సర్పంచులు రమణమ్మ, చెంచమ్మ, నాయకులు గొంజి వెకంటేశ్వర్లు, తిరుపాల్, ఎల్లయ్య, ప్రభాకర్ ఉన్నారు.





తందనాన భళా.. తందనాన..!
ఆకట్టుకున్న సామూహిక అన్నమయ్య కోలాట నృత్య ప్రదర్శన
వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మమొక్కటే..' 'తందనాన భళా.. తందనాన' అంటూ సాగిన అన్నమయ్య సామూహిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కళా ప్రదర్శనతో ఎస్వీయూ పరిపాలనా భవన ప్రాంగణం శోభాయమానంగా కనిపించింది. అన్నమయ్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏక కాలంలో 1,250 మందితో ఎస్వీయూ వేదికగా నిర్వహించిన సామూహిక కోలాట నృత్య ప్రదర్శన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించుకుంది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధి నరేంద్ర, ఏపీ కో-ఆర్డినేటర్ అరుణ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే అబాకస్ అధినేత రామకృష్ణారెడ్డి, ఎస్వీయూ ఎన్‌ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, బీజేపీ నాయకురాలు సుమతిరెడ్డి, ఇంజనీరింగ్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు రామకృష్ణ

వెంకటగిరిటౌన్, నాయుడుపేట, కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. యూటీఎఫ్ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి యూటీఎఫ్ ఎనలేని కృషి చేస్తోందన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుమారస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ, ఉదయకుమార్, గంగారావు, వెంకటేశ్వర్లు, సరస్వతి శ్రీనివాసులు, కృష్ణమూర్తి, రాధాకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ● నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. బాబురెడ్డి, రామమూర్తిరాజు, రాజశేఖర్, శేఖర్, చంద్రశేఖర్, సాయిలక్ష్మి, నాగూరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ● కోట పట్టణంలోని షాదీమందిర్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు జరిగాయి. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, రమేష్, బాబురెడ్డి, మనోహర్, భాస్కర్, ముమాయిష్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో మేధాశక్తి పెంపు



చెస్‌పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రసాద్, చెస్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెస్ ఆడడం వల్ల విద్యార్థుల్లో లలో మేధాశక్తి పెరుగుతుందని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ అన్నారు. ఆదివారం కళాశాలలో ఆంధ్రాచెస్, తిరుపతి జిల్లాచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఫణికుమార్, మంజుల, నరేంద్ర పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతపూజల్లో భక్తులు

గూడూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎస్ రాయులు కల్యాణ మండపంలో ఆదివారం కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజేంద్రరెడ్డి, మధుసూదనరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవానీ శంకరుడికి రుద్రాభిషేకాలు



భవానీ శంకరుడికి అన్నాభిషేకం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం షిరిడీసాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో కార్తీక మాసన వనభోజనాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతులతో పాటు షిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ఆ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో భవానీ శంకరుడికి రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని అన్నంతో అలంకరించారు. అనంతరం భక్తులు వన భోజనాలు చేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ డే వేడుకలు



ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, నావెల్ యూనిట్ ఏఎన్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి ఎన్‌సీసీ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. కళాశాల ప్రాంగణంతో పాటు గూడలి, విద్యానగర్ ఆర్‌ఎంబీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

సాధూపేటలో కార్డెన్ సెర్చ్



ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాధూపేటలో ఆదివారం ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేసి సరైన ధృవీకరణ పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన కొణతాలపల్లి రామసుబ్బయ్య రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి చెక్కును అందజేశారు. దాతకు ఆలయ అధికారులు రశీదు ఇచ్చారు.


'దేవకీనందన వాసుదేవ'కు విశేష ఆదరణ
● గల్లా జయదేవ్ వెల్లడి



కేక్ కట్ చేస్తున్న హీరో గల్లా అశోక్, గల్లా జయదేవ్ తదితరులు

తిరుపతి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గల్లా అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' సినిమాకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అమరరాజా సంస్థల ఛైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన, తన కుమారుడు అశోక్‌తో కలసి తిరుపతిలోని కృష్ణతేజ థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భారీ కేక్‌కట్ చేశారు. ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూశారు. అశోక్ నటించిన రెండో సినిమాను విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు జయదేవ్ ధన్యవాదాలు తెలిపారు. చిత్రానికి పబ్లిసిటీ తక్కువగా ఉన్నా ప్రేక్షకుల ఆదరణ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో గల్లా సిద్ధార్థ, హర్ష గౌరినేని, నరసింహనాయుడు, బాలకృష్ణారెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, మునినాదం, బడి సుధాయాదవ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలిచేది టీడీపీనే



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ నేతలు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి అండగా నిలిచే ఏకైక పార్టీ టీడీపీనేనని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికీ రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందన్నారు.


మన్నారుపోలూరులో టీడీపీ సభ్యత్వ నమోదు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు గిరిజన కాలనీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునస్వామి, శ్రీనివాసులు, మోదుగు కృష్ణయ్య, మునిశేఖర్, యుగంధర్, సీహెచ్ సురేష్, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

కురుగొండలో...

ఓజిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, విశ్రాంత పారా మెడికల్ అధికారి దారా అంకయ్య ఆధ్వర్యంలో గ్రామ దళిత, గిరిజన కాలనీలలో 500 సభ్యత్వాలు నమోదు చేశారు.

చెంగాళమ్మ సేవలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్



చెంగాళమ్మను దర్శించుకొని బయటకు వస్తున సురేష్ రెడ్డి, పక్కన బీజేపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మను ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆదివారం దర్శించు కొన్నారు. ఆయనకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఎన్.శ్రీనివాసులు, చెన్నకేశవులు, మనోహర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.